# ఓ హాస్య రచయిత బాధ కథ

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు

అది ఓ హాస్య రచయిత ఇల్లు.

అంటే మా ఇల్లన్నమాట.

సాధారణంగా రచయిత పాత్రని పరిచయం చేస్తాడు. నా కథలో నేనే పాత్రని.

ఇహ ఆ ఇంట్లోకి వెళితే..

"ఏవండీ.. మిమ్మల్నే.." మబ్బుల్లేకుండా ఉరిమినట్టు మా ఆవిడ గొంతు.

"ఏవిటి?" కాగితాల పైనుండి దృష్టిని మా ఆవిడ వైపు మళ్ళించాను.

"ఇప్పటికి వినిపించిందన్నమాట నా గొంతు. హుం ... పేరుకి మీరో గొప్ప హాస్యరచయిత. మీ రచనలతో ఆంధ్ర దేశాన్ని నవ్విస్తారు. కాని భార్యని నవ్విద్దామని మీలో ఏ కోశానా వుండదు. హాస్య రచయితని పెళ్ళి చేసుకుని అనుక్షణం ఏడుస్తూ గడుపుతున్నాను."

"ఇంతకీ ఏవైంది? నిన్ను నవ్వించాలంటే నేనేం చేయాలి?.. పోనీ నా లేటెస్ట్ జోక్స్ సంకలనం తెచ్చి విన్పించేదా?" అన్నాను కళ్ళజోడు వేళ్ళతో పైకి తోసుకుంటూ.

"అంతే నా బ్రతుక్కి అదే మిగిలింది. అవి మీరు విన్పిస్తుంటే నేను ఏడవలేక నవ్వుతుంటాను.. సరిపోతుంది..."

"మరి నన్నేం చేయమంటావో చెప్పు"

"అన్నీ నా నోటితోనే చెప్పించాలనేగా.." ముక్కు చీదుకుని "అరె పెళ్ళయి అయిదేళ్ళవుతోంది. పెళ్ళానికో పట్టుచీర కొందాం. నగ కొందాం.. లాంటి ఆలోచన లేం వుండవు. ఏ పెళ్ళికైనా.. పేరంటానికైనా వెళ్తే.. 'ఆవిడే హాస్య రచయిత ఆనందరావు పెళ్ళాం' అని ఎవరైనా అంటే.. అక్కడున్న వాళ్ళందరూ నా వంక చూస్తుంటే సిగ్గుతో చచ్చిపోవాలన్పిస్తుంది. 'ఆవిడ ఇంట్లో బోలెడన్ని చీరలు, నగలు వుంటాయి. ఆవిడే అలా సింపుల్‌గా వస్తుంది' అంటూ ఎకసక్కాలు. మీకవేం పట్టవు. ఆ కలం కాగితాలు వుంటే చాలు.." మాటల్లో ఏడుపుని మిళితం చేస్తూ అంది.

ఒక్కసారి చాలా కాలం తర్వాత వచ్చే పండగేమిటా? అని ఆలోచించాను. ఉగాది మెదిలింది. వెంటనే "నీ బాధని నేను అర్థం చేసుకున్నాను. వచ్చే ఉగాదికి నీకో పట్టుచీర.. నెక్లెస్ శాంక్షన్" అన్నాను. "ఎనిమిది నెలల తర్వాతా?" నా వంక అనుమానంగా చూసి "పోన్లెండి.. మీ నోటి నుండి ఆ మాత్రం వస్తుందనుకోలేదు. ఇన్నాళ్ళూ ఎదురు చూసినదాన్ని ఆ మాత్రం ఎదురు చూళ్ళేనూ..." అని "మాట తప్పారో మర్యాద దక్కదు అన్న భావం కళ్ళలో కనబరుస్తూ..."

"అరె తొమ్మిదైంది మాటల్లో పడిపోయాను. టిఫిన్ పెట్టవోయి ఆఫీసు కెళ్ళాలి" అన్నాను.

మా ఆవిడ ఇడ్లీలు కొబ్బరి చెట్నీతో తెచ్చిపెట్టింది. దూది పింజెల్లా వున్న వాటిని ఆదరా బాదరాగా నోట్లో వేసుకుని, డ్రస్ చేసుకుని ఆఫీసు కెళ్ళడానికి స్కూటర్ తీశాను.

అరకిలో మీటరు ప్రయాణించానో లేదో 'దుర్.. దుర్" అని శబ్దం చేస్తూ స్కూటర్ ఆగిపోయింది.

మాఆవిడ నాకు అష్టోత్తరం వినిపించినపుడే ఇవాళ బ్యాడ్ డే అనుకున్నాను. కిలోమీటరు దూరంలో వున్న మెకానిక్ దగ్గరకి ఆయాసంతో స్కూటర్‌ని తోసుకుంటూ తీసుకెళ్లాను.

"ఏవైంది సార్?" మెకానిక్ అడిగాడు.

రొప్పుతూ మాట్లాడలేకపోయాను.

"హో.. మీరు మూగవారా.. ఇదిగోండి ఈ కాగితం మీద రాయండి" అన్నాడు నాకో కాగితం ఇస్తూ..

నేను వాడివంక కొరకొర కోపంగా చూస్తూ ప్రాబ్లం చెప్పాను.

వాడు కాసేపు స్కూటర్‌ని శల్యపరీక్ష చేసి.. పెదవి విరిచి "ఇది ఇప్పుడే కాద్సార్. సాయంత్రం వచ్చి తీస్కుపోండి" అన్నాడు.

చేసేదేం లేక బస్సులో ఆఫీసుకు వెళ్ళాను.

లోపలికెళ్ళగానే దుర్వాసుడు (మా ఆఫీసర్) పిలుస్తున్నాడని కొలీగ్ కనకం చెప్పాడు. ఆయన పిలవకపోతే ఆశ్చర్యపోవాలిగాని.. పిలిస్తే ఎందుకు? అనుకుంటూ ఆఫీసర్ గదిలోకి అడుగుపెట్టాను. నాకు తెలుసు నా వెనక ఆఫీసు స్టాఫంతా వచ్చి గోడలకి చెవులానిస్తారని.

ఆఫీసర్ నా వంక చూశాడు అభావంగా. ఆయన్ని చూస్తే నాకు ప్రశాంతంగా వున్న అగ్నిపర్వతం గుర్తొస్తుంది. అఫ్‌కోర్స్ ఆయన రూపం అలాగే వుంటుంది.

ముఖం దగ్గర్నుండి కిందికొస్తున్న కొద్దీ పెరుగుతూ..

"సార్... స్కూటర్ ట్రబులిచ్చింది. అందుకని బస్ లో వచ్చాను. కాస్త ఆలస్యమయింది" నసుగుతూ అన్నాను.

"జోకా..." అన్నాడు. నేనో హాస్య రచయితని కదా ఏం చెప్పినా జోకే...

"కాదు సార్ సీరియస్సే..." అన్నాను.

"అంటే నువ్వేమో సీరియస్‌గా చెబుతావు. మేము మాత్రం జోకర్‌లా అన్నీ వినాలి. అసలు మిమ్మల్ని అనకూడదయ్యా.. ఈ ఆఫీసొక సత్రం.. వచ్చేవాళ్ళు వస్తుంటారు.. పోయేవాళ్ళు పోతుంటారు. నేను మాత్రం ప్రేక్షకుడ్ని. పరమానందయ్య శిష్యుల్లాంటి మీతో.." అని ఇంకా ఏంటేంటో అంటున్నాడు.

నాకు ఏసి రూమ్‌లో కూడా చెమటలు పడుతున్నాయి. ఏం వినిపించట్లేదు.. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. పడిపోయేవాడ్నేమో గాని అంతలో అదృష్ట వశాత్తు ఫోన్ వచ్చింది. పులి పిల్లై పోయింది.. వాళ్ళావిడ అనుకుంటా.. ఫోన్‌కి చేయడ్డం పెట్టి "ఇంక పో..." అన్నాడు.

నేను ఈసురోమంటూ బయటకొచ్చాను.

"ఏం గురూ.. ఇడ్లీయా.. పూరీయా.." అడిగాడు సుదర్శనం.

అవి బాస్ హెరాస్‌మెంట్‌కి మేం పెట్టుకున్న కోడ్.

ఇడ్లీ అంటే లైట్‌గా తిట్టడం. పూరీ అంటే స్ట్రాంగ్ అన్నమాట. ఎందుకంటే పిండిని కుళ్ళబొడుస్తూ ఒత్తి... నూనెలో వేస్తారు కదా! అందుకు.

"పూరీనేలే.. ఫేస్ చూస్తేనే తెలుస్తోంది కదా!" మళ్ళీ సుదర్శనే అన్నాడు. నేను సీట్లో కూర్చున్నాను.

"గురూ... ఓ ఫిఫ్టీ వుంటే సర్దు" అంటూ వచ్చాడు గిరీశం. అతని అసలు పేరేంటో ఎప్పుడో మర్చిపోయా గిరీశం లాగా వుంటాడు. అలాగే మాట్లాడుతాడు. అందుకే ఆ పేరు పెట్టుకున్నాం.

"నా దగ్గర లేదు" అన్నాను.

"ఒరే.. వీడు పుస్తకాల్లోనే కాదు మన దగ్గరా జోకులేస్తున్నాడ్రోయ్.." అని కొద్దిగా వంగి.. నా జేబు లోంచి ఏభై నోటు తీసుకెళ్ళాడు. ఓ వంద రూపాయలు ప్యాంట్ జేబులో పెట్టుకోవడం మంచిదయింది. లేకపోతే గిరీశంగాడు గ్రద్దలా తన్నుకుపోయేవాడు. సాయంత్రం స్కూటర్ రిపెయిర్‌కి ఎంతవుతుందో ఏమిటో?"

ఫైలు ముందేసుకుని రాస్తూ కూర్చున్నాను.

"ఏంటండీ.. హాస్య కథ రాస్తున్నారా?" నవ్వుతూ అడిగింది రామలక్ష్మి.

"నేను ఆఫీసులో కథలు రాయనండి.. ఇంతకు ముందే చెప్పాగా..." అన్నాను.

"ఊర్కోండి.. ఆఫీసులో గొడ్డుచాకిరీ చేస్తూ.. ఇంట్లో ఏం చేయగలం.. ఏం రాయగలం.. నేనేం బాస్‌కి చెప్పనులేండి" అంది.

"చూడండి.. నేనేం కథలూ కాకరకాయలు రాయడంలేదు" అని ఫైలు చూపించాను కాస్త కోపంగా.

## ఉత్తరాల తాత

**ను**వ్వు తెచ్చే కబురు గురించి కాదు
ఆత్మీయ స్పర్శలా హృదయాన్ని తాకే
నీ చిరునవ్వు గురించే నిరీక్షణ!
ఆ నవ్వు కోసమే వొక్కోసారి
నాకు నేనే జాబురాసుకోవాలనుకుంటాను
నన్ను నేనే పలకరించుకోవాలనుకుంటాను
నా కోసం ఆలోచించేవాళ్లని
నా గుమ్మంలో వొదిలేసి వెళ్లే
చల్లని చందమామ నీవు
నా మనసు ఎదురు చూస్తున్న
వసంత రుతువుని మోసుకొచ్చే
జయంత రథసారథి నీవు
కారెండలో కురిసిన స్వాతి చినుకులా
నీ పిలుపులో పరిచయ పరిమళం
ఆత్మ అంతరాంతరాల్లోకి చొచ్చుకుపోయే
కులాసాల విశ్వాసం నీ రాకలో.
ఎన్నెన్ని జన్మల బంధమో
నీ అడుగుల సవ్వడి వంటింట్లోకి
గుండెల లయలా వినిపిస్తుంది.
ఊగే వుయ్యాల పెంచుకోవటం
ఊపిరి వేగం పెంచుకోవటం
రెండూ వొకే క్షణం నీ పిలుపుతో
భుజాన వుత్తరాల సంచీ మోసుకొని
వడివడిగా నీవు నడిచి వస్తుంటే
అర్థరాత్రి యింటింటి గుమ్మాల ముందు
ఆనందాల కానుకలు వొదిలివెళ్లే
క్రిస్మస్ తాతలానే వుంటావు!

-ఈతకోట సుబ్బారావు

"సర్లే దానికంత కోపం దేనికండీ.. ఇప్పుడంటే రాయట్లేదు కాని.. ఆఫీసులో ఏం రాయకుండానే గొప్ప రచయితయ్యారా?" గొంతు పెద్దది చేస్తూ అంది.

ఇంక దాన్ని ప్రొలాంగ్ చేస్తే నాకే ప్రమాదమని మాట్లాడకుండా ఫైల్లో తల దూర్చాను.

సాయంత్రం.

బస్టాపులో నుంచున్నాను. నాలుగు బస్సుల జనంతో ఒక్కో బస్సు వస్తోంది. దాదాపు రెండు గంటలపాటు ఎన్ని ప్రయత్నాలు చేసినా బస్సెక్కలేకపోయాను. ఆటోని పిలిచాను. మీటరు మీద పాతికడిగాడు.

పొద్దుట్నుంచి అలసిపోయి వున్నానేమో.. ఆటో ఎక్కి కూర్చున్నానో లేదో కునుకు పట్టింది. కొంతసేపటికి అదాటున మెలకువ వచ్చింది. ఇంకా ఆటోలోనే వున్నాను. నాకెంతో ఆశ్చర్యం అనిపించింది. ఆఫీసు నుండి మా ఏరియాకి ఇరవై నిముషాలు. అలాంటిది ముప్పావు గంట క్రితం ఎక్కిన ఆటోలో ఇంకా కూర్చునే వున్నాను.

"అదేంటయ్యా.. ఇంతసేపు తిప్పావు" అన్నాను.

మీరేమన్నా కొత్త పెండ్లికొడుకా సార్ ఊరంతా తిప్పనీకి.. ట్రాఫిక్‌లో జర టైమవుతది మళ్ళ..." అన్నాడు.

"ట్రాఫిక్కా... నేను రోజూ స్కూటర్ మీద వెళతాను. అంత ట్రాఫిక్కేం వుండదే"

"జోకులేస్తున్నారా సార్.. స్కూటర్ రెండు చక్రాలతో సన్నంగుంటది.. ఆటో మూడు చక్రాలతోటి పెద్ద గుంటది.. ట్రాఫిక్‌లో పోడం ఎంత కష్టం?.. గది గూడ చెప్పాల్నా సార్" నాకేదో గీతోపదేశం చేస్తున్నట్టు నవ్వుతూ చెప్పాడు.

ఇంకేం మాట్లాడలేదు.

మెకానిక్ షాప్ దగ్గర ఆటో ఆపించి "ఎంత" అన్నాను.

వాడు అగ్గిపుల్ల గీసి మీటర్ చూసి "తొంభై రూపాయలు" అన్నాడు.

"తొంభై రూపాయలా?" నా గుండె క్షణకాలం ఆగింది. హార్ట్ ఎటాక్‌లు రావడానికి ఆటోచార్జీలూ కారణమేమో?

"ఆవుమల్ల... బస్‌లో లెక్క తోపులాట ల్లేకుండా.. మంచిగా.. సల్లగా రాలే.. సుఖంగా ప్రయాణం చేస్తారు.. పైసలిమ్మంటే సస్తరు" అన్నాడు. వాడి శాప నార్థాలు వినలేక వందిచ్చాను. "ఈడ నుండి గిరాకీలు వుండవు సార్.. రోడ్డు దాకా పోవాల" అని పదివ్వకుండా ఆటో స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

నడిరోడ్డు మీద పైసా లేకుండా సత్యహరిశ్చంద్రుడిలా మిగిలిపోయాను. నెమ్మదిగా మెకానిక్ దగ్గరకి వెళ్ళాను.

"ఏం సార్... ఇంత లేటా... మీ గురించే ఇంతసేపు ఆగినా.. పోనీ స్కూటర్ లోపల పెడదామంటే షాప్ చిన్నదాయే.. పోల్లే ఇప్పటికైనా వచ్చింద్రు.. ఏడొందలిచ్చి బండి పట్కపోండి" అన్నాడు.

"ఏడొందలా.. అంతెలా అయింది?" తడారి పోతున్న గొంతుతో అన్నాను.

"మా మీద గంత డౌటున్నపుడు దగ్గరుండి చేయించుకోవాలి.. బండి మాకొదిలేసి.. మీ పన్లు చేసుకుంటారు.. పైసలిమ్మంటే పాణం పోయినట్టు జేస్తారు" అన్నాడు.

"నా దగ్గర ఇప్పుడు డబ్బుల్లేవు, రేపిస్తాలే..." అన్నాను.

"థూ.. ఏం గిరాక్సార్.." అని షాప్‌కి తాళం వేసి బండిపైకి ఎక్కి స్టార్ట్ చేసి.. రేపు పొద్దుగాల పైసలిచ్చి బండి తీస్కపో" అని తుర్రుమని వెళ్ళిపోయాడు.

నేను కాళ్ళీడ్చుకుంటూ ఇంటికెళ్ళాను.

తలుపు తట్టాను. మా ఆవిడ తలుపు తెరచింది.

"స్కూటర్ ఏమైంది" అడిగింది.

"వాళ్ళ నాన్నిచ్చిన స్కూటర్.. నాకేమైనా ఫర్వా లేదు.. దానికేం కాకూడదు"

నేను జరిగింది చెప్పాను.

"అయ్యో.. స్కూటర్‌ని మెకానిక్ పట్టుకుపోయాడా? వాడు ఇవాళ రాత్రి దాన్నేం చేస్తాడో.. అస్సలు లౌక్యం తెలీని మనిషిని పెళ్ళిచేసుకుని మోసపోయాను. అరె.. స్కూటర్ మీద వాడ్ని ఇంటికి తీసుకొచ్చి డబ్బివ్వచ్చుగా. వాడు పార్టులన్నీ మార్చేస్తాడు. అయ్యో భగవంతుడా.." మళ్ళీ రాగంతీస్తూ ముక్కు చీదడం మొదలెట్టింది.

"ఊర్కో శాంతా.. చుట్టుపక్కల వాళ్ళు నాకేమైనా అయిందనుకుంటారు.." అన్నాను.

"మీకేమవుతుంది.. గుండ్రాయిలా వుంటారు.. పాపం మా నాన్న అప్పుచేసి మరీ మీ చేతుల్లో పెట్టాడా స్కూటర్ని. ఇవాళతో దాని పని ఆఖరు" వెక్కుతూనే వుంది.

రాత్రంతా స్కూటర్ నామజపమే.

తెల్లారంగానే డబ్బు జేబులో పెట్టుకుని.. లుంగీ కట్టుకుని మెకానిక్ దగ్గరకి బయల్దేరాను.

షాపు తెరవలేదు.

నా పిచ్చిగాని.. అప్పుడే తెరుస్తారా? దగ్గర్లో వున్న పాన్‌షాప్‌లో పేపరు కొనుక్కుని దాంట్లో మునిగి పోయాను. తొమ్మిదైంది.. పదైంది.. వాడు తెరవలేదు. నాకు భయం పట్టుకుంది. షాప్ వంక చూశాను.. చాలా చిన్నది.. దాంతో పోలిస్తే నా స్కూటరే ఖరీదైంది.

## కదిలించే కాలమా!

క్షణమొక కనురెప్పలా
యుగమొక యుగాదిలా
కదిలించే శక్తి కాలానికే ఉంది.
కనులు మూస్తే చీకటి కాలం
కనులు విచ్చుకుంటే పగటికాలం
పరిశ్రమించే వారికి ఎప్పుడూ పగలే
తపించని జీవితానికి ఎల్లప్పుడూ చీకటే
కాలం ఎంతటి దృశ్యాలను చిత్రిస్తుందో
కాలం మరెంతటి గమ్యాలకు చేరవేస్తుందో
గతంలో గడిచిన కాలచక్రంలో
ఎందరెందరో కనుమరుగయ్యారు
మరెంతటి కీర్తిప్రతిష్ఠలు కొలవబడ్డాయో
కాలమొక్కటే కనికరిస్తే కుంటివాడు
పరుగుల జీవితంలో ఫలితాన్ని సాధిస్తాడు
కనులు లేనివాడు రంగుల కలలను కంటాడు
మూగవాడు మహా ప్రవక్త అవుతాడు
చెవిటివాడు చరిత్రను తిరగరాస్తాడు
అజ్ఞాని జ్ఞాని జ్ఞాని సుజ్ఞాని అవుతాడు
నిరుపేద నిండు ధనవంతుడు
కుబేరుడు కుచేలుడవుతాడు
కలం పట్టనివాడు మహాకవి అవుతాడు
గళం విప్పనివాడు గాన గంధర్వుడైపోతాడు
కాలంముందు ఎంతచెప్పినా ఎంత రాసి వేడినా
కాలమే కలిస్తే నడిచే కొడుకొస్తాడు (కదిలించే కొడుకొస్తాడు)
వికటిస్తే నట్టింటిలో ముంచేవాడవుతాడు
అందుకే ఓ కాలమా! నిను నేను మరచినా నన్ను నీవు మరవకు సుమా!
కాలమంటే ఏమిటో ఇంకా తెలియనివాడ్ని
కాలపాఠం చెప్పటానికి ఈ ఉగాది నుండైనా
మా ఇంటికి రావయ్యా!
మంచి కాలాకి జ్ఞాపికగా ఉండవయ్యా!

**-రాంబత్రి గంగాధర్**

కొంపదీసి దాంతో పారిపోయాడేమో? అలాంటిదే మన్నా జరిగితే... మా ఆవిడ్ని తలచుకోగానే ఒళ్ళు జలదరించింది. పక్కనే వున్న మటన్‌షాపు వాడిని అడిగాను. వాడు నా వంకోసారి చూసి.. మెకానిక్ చాలా మంచివాడని.. తొమ్మిదిన్నరకి కాస్త అటూ ఇటుగా షాప్ తెరుస్తాడని.. చెప్పడంతో ప్రాణం కుదుటపడింది.

కాసేపటికి మెకానిక్ షాప్ తెరిచాడు. నన్ను చూసి "రండి సార్" అని "డబ్బు తెచ్చారా?" అన్నాడు.

నేను జేబులోంచి ఏడొందలు తీసివ్వబోయాను. "ఏంది సార్.. నేను నిన్న రాత్రి ఇంటికి పోతుంటే స్పార్కింగ్ ప్లగ్‌ల ప్రాబ్లం వచ్చింది. కొత్తది మార్చిన ఇంకో వందివ్వాల" అన్నాడు.

నేను మరో వంద కలిపి వాడికి డబ్బిచ్చి స్కూటరెక్కాను.

స్కూటర్ని చూశాక మా ఆవిడకి కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు.

స్కూటర్ హడావుడిలో ఆఫీసు సంగతి మర్చిపోయాను. రెండు గంటలు ఆలస్యమయింది. దుర్వాసుడు గుర్తొచ్చాడు. గబగబ తయారయి ఆఫీసుకి వెళ్ళాను.

ఆఫీసులోకి ఎంటర్ అవంగానే.. ఆఫీసరు రాలేదన్న చల్లని వార్త చెప్పాడు అటెండరు. ఊపిరి పీల్చుకోవడం సాధారణ స్థాయికి వచ్చింది.

"గురూ.. నువ్వు రాగానే ఆఫీసర్ వాళ్ళింటికి ఫోన్ చేయమన్నాడు" అని సుదర్శన్ అనగానే నా పై ప్రాణాలు పైనే పోయాయి.

వెళ్ళి డయల్ చేశాను.

ఆఫీసర్ ఫోన్‌లోకొచ్చి "ఏంటి ఆలస్యంగా వచ్చావా? నేను ఆఫీసుకి రాకపోతే ఆటాడుకుందామనుకుంటున్నావా? నేనిక్కడున్నా అక్కడున్నట్టే ఏవనుకుంటున్నారో ఖబడ్దార్.." ఆ వాక్ప్రవాహం సాగిపోతూనే వుంది. నాకు ముచ్చెమటలు పట్టాయి.. పార్లల్ ఫోన్‌లో స్టాఫంతా వింటున్నారని తెలుసు. వాళ్ళకేం ఆనందమో మరి.. తిట్ల దండకం పూర్తయ్యాక వచ్చి సీట్లో జేరగిలబడ్డాను.

ఇంట్లో భార్య.. ఆఫీసులో దుర్వాసుడు.. స్టాఫ్.. మధ్య మధ్య మెకానిక్.. ఆటో డ్రైవర్‌ల లాంటివాళ్ళు.. ఇంత మంది శాడిస్టుల మధ్య ఓ హాస్య రచయిత నవ్వుతూ ఎలా బ్రతగ్గలడు? నవ్వించే రచనలు ఎలా చేయగలడు? హుఁ... మీరైనా చెప్పండి! ■